నేడు జాతీయ లోక్ అదాలత్

ఏర్పాట్లను పరిశీలించిన కార్యదర్శి జావెద్ పాషా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రతీ మూడునెలలకోసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావెద్ పాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. సికింద్రాబాద్, నాంపల్లి, మనోరంజన్ ప్రాంగణంలో ఉన్న కోర్టులకు సంబంధించి..పోలీసు స్టేషన్ల పరిధిలో రాజీ చేసుకోదగ్గ కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఇప్పటివరకు జాతీయ లోక్ అదాలత్‌లో హైదరాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈసారి కూడా జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి అందరూ కృషిచేసి ప్రథమస్థానంలో నిలపాలని కోరారు. కక్షిదారుల కోసం భోజన వసతి, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్, ట్రాఫిక్ చలానా కేసులు, ఎక్సైజ్, సివిల్ కేసుల పరిష్కారానికి ఇరువర్గాలకు చెందినవారు ముందుకు రావాలని తెలిపారు. రాజీ చేసుకోవడం వల్ల ఇరువర్గాల కక్షిదారులు గెలిచినట్టుగా భావించవచ్చన్నారు. డబ్బుతోపాటు సమయం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకోకుండా ఉండేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదికన్నారు. పోలీసు అధికారులు, పీపీలు, మెజిస్ట్రేట్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కక్షిదారులను ప్రోత్సహించి తాగాదాలను తొలగించుకునే అవకాశాన్ని కల్పించేందుకు చేయూతనందించాలని విన్నవించారు. సత్వర పరిష్కారంతో అప్పీలులేని తీర్పులను పొందవచ్చన్నారు. ప్రి లిటిగేషన్ కేసులుగా పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ శాఖ
#249/3RT, 1వ అంతస్తు, S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500038

ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8 నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు (లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుట కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", " ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన దిగువ తెలిపిన తేదీన విక్రయించబడుతుందని సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, బయానా దిగువ తెలియజేయబడినవి:

రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు పేరు మరియు చిరునామా: కుమార సుహార్ లత పి తండ్రి స్వర్గీయ పి.ధన్‌రాజ్, ఫ్లాట్ నెం.ఎ-1, 5వ అంతస్తు, ఇండియన్ బ్యాంక్ ఫ్లాట్స్ (Ib ఫ్లాట్స్), గోల్కొండ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, తెలంగాణ-500020.

స్థిర సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించుట ద్వారా రాబట్టుకోవలసిన సెక్యూర్డ్ రుణం: 31-05-2025 నాటికి రూ. 40,02,367.29 పై. మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు.

విక్రయించబడు స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ

గాంధీనగర్, కవాడిగూడ, బాకారం, గోల్కొండ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్ మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ వద్ద గల 44.62 చ.గజాలు విస్తీర్ణపు భూమి అవిభాజ్య వాటాతో, 910 చ.అ. విస్తీర్ణం బిల్టప్ ఏరియాతో మున్సిపల్ నెం.1-1-530 కలిగిన "I.B.ఫ్లాట్స్"గా పేరొందిన ఇండియన్ బ్యాంక్ ఫ్లాట్స్ బిల్డింగ్, 5వ అంతస్తులో నివాస ఫ్లాట్ నెం.ఎ-1 యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: మెట్లు మరియు ఫ్లాట్ నె.ఎ-2, తూర్పు: ఖాళీ, పడమర: ఫ్లాట్ నెం.సి-1. ఆస్తి యజమాని: కుమార సుహార్ లత పి

రిజర్వు ధర: రూ.28,00,000/- బయానా: రూ.2,80,000/- బిడ్ పెంపుదల: రూ. 28,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: 15.07.2025న మ॥ 12.00 గం. నుండి సా॥ 5.00 గం. మధ్య
(10 నిమిషాల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్స్‌తో). ఇ-వేలం వెబ్‌సైట్ : https://baanknet.com

బయానా దాఖలు కొరకు ఆఖరి తేది ఇ-వేలం సమయం ముగింపులోగా బయానాను డిపాజిట్ చేయవలెను మరియు ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని మ్యాప్/లింక్ చేయవలెను. ఏదేని సాంకేతిక సమస్యలను నివారించుటకు ముందుగానే ఆస్తి ఐడితో బయానా మొత్తాన్ని మ్యాప్/లింక్ చేయవలెను.

మొబైల్ నం. మరియు చెల్లుబాటుగ ఇ-మెయిల్ ID ఉపయోగించి https://baanknet.comలో రిజిస్టర్ అవ్వండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడింగ్ రూల్స్ కొరకు https://baanknet.com యొక్క హోం పేజ్‌లో ఏర్పాటు చేసిన బయ్యర్ మ్యానువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించండి: 8291220220 ఇ-మెయిల్ ID support.baanknet@psballiance.com. ఇ-వేలం అమ్మకం ప్రాసీడింగ్స్‌లో పాల్గొనుటకు మరియు వారి బిడ్లను దాఖలు చేసే ముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన నియమనిబంధనల కొరకు టెండరుదారు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in ను చూడవలసిందిగా బిడ్డర్లకు సూచించడమైనది. గెలుపొందిన బిడ్డరు ఇ-బిడ్డింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత ఇ-మెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆస్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారి, 249/3RT, 1వ అంతస్తు మెయిన్ రోడ్డు SR నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నం. 9987321173, 9885599551.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

గమనిక: అమ్మకం ఏదేని సెక్యూరిటైజేషన్ అప్లికేషన్ (SA) ఫలితానికి లోబడి ఉంటుంది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09.06.2025

అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ శాఖ.

పేదలను రోడ్డున పడేశారు..

- రోడ్డు పక్కన ఉన్న డబ్బాల తొలగింపు..
- ఓ గేటెడ్ కమ్యూనిటీవారి కోసమే కూల్చారని బాధితుల ఆరోపణ
- మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- శంషాబాద్ మున్సిపాలిటీ సాతంరాయిలో ఘటన

సాతంరాయి గ్రామ రోడ్డు పక్కన వేసిన డబ్బాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

శంషాబాద్ రూరల్, జూన్ 13 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయి గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చిన్న చిన్న డబ్బాలు(దుకాణాలు)పై మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య డబ్బాలను కూల్చివేశారు. బాధితులు ఎంత వేడుకున్నా కనికరించకుండా తొలగించారు. ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న ధనవంతుల కోసం ఇదంతా చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సాతంరాయి గ్రామంలో ఓ గేటెడ్ కమ్యూనిటీ ఉన్నది. అందులోని విల్లాలను ధనవంతులు, ఐఏఎస్, ఐపీఎస్ క్యాడర్ అధికారులు కొనుగోలుచేసి ఉంటున్నారు. ఈ కమ్యూనిటీ ప్రహరీ పక్క నుంచే ఉన్న రోడ్డు నుంచి గ్రామానికి వెళ్తుంటారు. ఈ రోడ్డు పక్కనే నిరుపేదలు డబ్బాలు(దుకాణాలు) ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే.. ప్రహరీకి ఆనుకుని డబ్బాలు ఉండడంతో కొంతమంది వాటిని తొలగించాలని శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు వందలాది మంది పోలీసులను తీసుకువచ్చి నిరుపేదలు వేసుకున్న డబ్బాలను తొలగించి.. జీవనోపాధిపై దెబ్బకొట్టి, రోడ్డున పడేశారని బాధితులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులతీరుపై స్థానిక నాయకుడు, మాజీఉప సర్పంచ్ భవానీ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ జల్లపల్లి నరేందర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. గత పదేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్న మాపై ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు.

ఆదుకోవాలి..

50ఏండ్లుగా ఇక్కడే జీవనం సాగిస్తున్న మాకు కనీసం ఇంటి జాగ కూడా లేదు. మేము బతకడం కోసం చిన్నడబ్బాలు వేసుకొని జీవనం సాగిస్తున్నాం. సడన్‌గా వచ్చి అధికారులు మా డబ్బాను కూల్చివేశారు. మాకు ఏ దిక్కులేదు. తమను ఆదుకోవాలి.

– సుకన్య, స్థానిక మహిళ

22 బస్సులు సీజ్

సిటీబ్యూరో, జూన్13,(నమస్తే తెలంగాణ): నగరంలోని విద్యాసంస్థల బస్సులను శుక్రవారం ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 22 బస్సులను సీజ్ చేశారు . ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమించి బస్సులు నడిపితే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, బస్సులు సీజ్ చేస్తామని తెలిపారు. ఫిట్నెస్‌లేని బస్సుల్లో పిల్లలను ఎక్కించుకోవద్దని చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న ట్రక్..యువకుడు మృతి

మేడ్చల్, జూన్ 13 : ట్రక్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ యువకుడు బలయ్యాడు. మద్యం మత్తులో అతివేగంతో వెళ్తూ ద్విచక్రవాహనదారుడిని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్‌లో నివాసం ఉండే ఉచిత రాంకిశోర్(29) రావల్‌కోల్‌లో ఉన్న ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులకు వెళ్లేందుకు

బైక్‌ను ఢీ కొట్టిన ట్రక్

ఉమానగర్ నుంచి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కిష్టాపూర్ రోడ్డులోని ప్రశాంతి వెంచర్ వద్దకు రాగానే కిష్టాపూర్‌కు చెందిన వాల్మీకి బాలరాజు(26) ట్రక్‌ను తాగిన మత్తులో అజాగ్రత్తగా, అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రాంకిశోర్‌కు తీవ్ర గాయాలు కాగా.. ట్రక్ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రాంకిశోర్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో దూరి.. శ్రీగంధంచెట్లు నరికి..

- పగలు రెక్కీ.. రాత్రిపూట చెక్కల చోరీ
- పార్థీ గ్యాంగ్‌కు చెందిన నలుగురు మహిళలు అరెస్ట్
- పరారీలో మరో 19మంది..

నిమ్స్ మే, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో నరికేసిన శ్రీగంధం చెట్లు

బంజారాహిల్స్, జూన్ 13: నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ శ్రీగంధం చెట్లను నరుకుతున్న ఘరానా గ్యాంగ్‌లోని నలుగురు మహిళలను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ మధుసూదన్ వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ రోడ్ నం.5లో నివాసం ఉంటున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలప్రసాద్ ఇంటి ఆవరణలో ఉన్న శ్రీగంధం చెట్టును రెండ్రోజుల క్రితం అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు నరికి చెక్కలను తస్కరించారు. మరుసటి రోజు గుర్తించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలతో పాటు ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులకు షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పార్థీ తెగకు చెందిన ముఠా శ్రీగంధం చెట్టును నరికి చోరీ చేసినట్లు తేలింది. మరింత లోతుగా విచారించగా మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మే 24, 31 తేదీల్లో నిమ్స్ మే ప్రాంగణంలో 9 శ్రీగంధం చెట్లను ఇదే గ్యాంగ్ నరికినట్లు తేలింది.

నగరంలోకి 20 పార్థీ కుటుంబాలు..

జూబ్లీహిల్స్‌లో శ్రీ గంధం చెట్టు నరికిన కేసులో దర్యాప్తు ప్రారంభించిన జూబ్లీహిల్స్ పోలీసులు సుమారు 40 నుంచి 50 సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.5నుంచి ఉప్పల్ వరకు నిందితులు ఆటోలో ప్రయాణించినట్లు తేలింది. ఆటో డ్రైవర్‌ను విచారించగా కొంతమంది మహిళలు తన ఆటోలో ఎక్కి ఉప్పల్‌లో దిగారని తెలిపాడు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో ఉప్పల్ చెరువు సమీపంలో గాలించగా నలుగురు మహిళలు దొరికారు. పోలీసులను చూసి మరికొంత మంది పరుగులు పెట్టారు. పట్టుబడిన మహిళలను విచారించగా 20 రోజుల క్రితం మొత్తం 20 పార్థీ కుటుంబాలు నగరానికి వచ్చాయని, తామంతా పిల్లలు, పెద్దలతో కలిసి పగటిపూట రెక్కీ నిర్వహించి.. రాత్రిపూట శ్రీ గంధం చెట్లను నరుకుతుంటామని అంగీకరించారు. ఎవరికీ అనుమానం రాకుండా తామంతా లగేజీతో పాటు పిల్లలతో కలిసి తిరుగుతుంటామని, అత్యాధునిక కట్టర్లు ఉపయోగించి శబ్దం రాకుండా శ్రీగంధం చెట్లను నరికి గంధం చెక్కలను చోరీ చేస్తామని, మార్కెట్‌లో గ్రేడ్‌లను బట్టి టన్నుకు రూ.9వేల నుంచి 18వేల దాకా ధర పలుకుతుందని వెల్లడించారు. కాలనీల్లో తిరుగుతూ వస్తువులు అమ్ముతున్నట్లు నటిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా శ్రీగంధం చెట్లను గుర్తిస్తారని పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన పాలన్ బాయి పర్థీ(26), షాహనాజ్ బాయ్(35), నిమత్ బాయి(43), మాధురీ ఆదివాసీ(25)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో 19మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారికోసం గాలింపు చేపట్టామని పోలీసులు తెలిపారు.

పార్ట్‌టైమ్ జాబ్ అంటూ రూ.8లక్షలు టోకరా..

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ ఆఫ్ గూగుల్ పార్ట్‌టైమ్ జాబ్స్ అఫర్ చేస్తుందంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు.. ఓ ప్రైవేట్ ఉద్యోగినికి రూ.8 లక్షలు టోకరా వేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన ప్రైవేటు ఉద్యోగిని టెలిగ్రామ్ ఐడీకి గ్లోబల్ ఆన్‌లైన్ మీడియా పార్ట్‌టైమ్ జాబ్స్ ఆఫర్ చేస్తోందని, తాను గూగుల్ ప్రమోషన్ డిపార్టుమెంట్‌కు చెందిన ప్రతినిధినంటూ సరిత పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. గూగుల్ మ్యాప్స్‌లో హోటల్ రెస్టారెంట్స్‌కు సంబంధించిన రివ్యూలు రాయాల్సి ఉంటుందని, మొదట రూ. 1040 చెల్లించాలంటూ సూచించారు. టాస్కులుంటాయని, ఒక్కోటాస్క్‌కు రూ.50లు మీ ఖాతాలో డిపాజిట్ అవుతుందని, 20 టాస్క్‌లిస్తారని, అదనంగా కావాలంటే ఇంకా ఎక్కువగా కూడా ఇస్తారంటూ సూచించారు. దీంతో బాధితురాలు అది నిజమని నమ్మి డబ్బు కడుతూ వెళ్లింది. అయితే మొదట కొంత లాభమంటూ స్క్రీన్‌పై చూపించిన నేరగాళ్లు.. మీరు సరిగ్గా టాస్క్‌లు పూర్తి చేయలేదని, మీ డబ్బు ఇప్పుడు డ్రా చేయలేరని, మరో టాస్క్ చేసి అందులో గతంలో పెండింగ్‌లో ఉన్న డబ్బును కలుపుకొని తీసుకోవాలంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా రూ. 8 లక్షలు కాజేశారు. ఇంకా డబ్బులు చెల్లించాలంటూ సైబర్‌నేరగాళ్లు సూచిస్తుండడంతో ఇదంతా మోసమని గుర్తించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

జీహెచ్‌ఎంసీ ప్రకటన విభాగంలో ఇద్దరిపై వేటు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగంలో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటూ అదనపు కమిషనర్ స్నేహ శబరీష్ నిర్ణయం తీసుకున్నారు. విధి నిర్వహణలో పలు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ చేపట్టి, అందుకు బాధ్యులైన ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అడ్మిన్ విభాగానికి సరెండర్ చేస్తూ స్నేహ శబరీష్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

విజయ డెయిరీ బాయిలర్‌లో పేలుడు

ఒకరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

ఉస్మానియా యూనివర్సిటీ: లాలాపేటలోని విజయ డెయిరీలో బాయిలర్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల గాయాలయ్యాయి. వారిని వెంటనే దవాఖానకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. లాలాపేటలోని విజయ డెయిరీలోని బాదం మిల్క్ బాయిలర్‌ను నిలిపివేసిన తర్వాత 20 నిమిషాల వరకు దాని మూతను తెరవకూడదు. సమయం పూర్తికాకముందే 12 ఏళ్ల అనుభవం ఉన్న రవి బాయిలర్ మూత తెరవడంతో పేలుడు సంభవించింది. బాయిలర్ మూత పగిలి.. గాజు ముక్కలు చెల్లాచెదురై .. ఒక్కసారిగా ఆవిరి బయటకు రావడంతో రవికి తీవ్ర గాయాలు కాగా.. అక్కడే ఉన్న మీరజ్, చంద్రయ్య, మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రవిని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించగా, మిగిలిన వారిని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. దాదాపు 50 శాతం కాలిన గాయాలైన రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తోటి కార్మికులు చెబుతున్నారు. రవి గత 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు ఎవరూ నోరు మెదపడం లేదు. భోజన విరామ సమయం కావడంతో కార్మికులు పెద్దగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ముగిసిన బార్ల లక్కీడ్రా

జీహెచ్‌ఎంసీ పరిధిలో 24 బార్లు కేటాయింపు

జీహెచ్‌ఎంసీ పరిధిలో 24బార్లకు సంబంధించి లక్కీడ్రా తీస్తున్న ఆబ్కారీ కమిషనర్ హరికిరణ్, తదితరులు

సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ పరిధిలో నోటిఫికేషన్ జారీచేసిన 24బార్లకు సంబంధించి నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం నార్సింగిలోని అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించిన బార్ల డ్రా కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ కమిషనర్ హరికిరణ్ పాల్గొని.. లక్కీ డ్రా తీశారు. గ్రేటర్ పరిధిలో 24బార్లకు నోటిఫికేషన్ జారీచేయగా వాటికి మొత్తం 3,525 దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తులకు సంబంధించిన నంబర్లను టోకెన్‌ల రూపంలో ముద్రించి వాటిని డ్రా బాక్స్‌లో వేయగా కమిషనర్ హరికిరణ్ 24బార్లకు సంబంధించి 24సార్లు డ్రా తీశారు. ఈ క్రమంలో లాటరీ ద్వార బార్లను దక్కించుకున్న 24మంది వ్యాపారులకు కమిషనర్ అలాట్‌మెంట్ లెటర్లను అందచేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీతో పాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్, జల్‌పల్లి ప్రాంతాల్లో లక్కీడ్రా ద్వారా బార్‌ల కేటాయింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించారు. బార్‌లను దక్కించుకున్న లైసెన్సీలు 90 రోజుల్లోగా బార్ల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసుకుని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డీసీ కే ఏ బీ శాస్త్రి, ఏసీ అనిల్ కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీ దశరథ్, ఏసీ ఆర్.కిషన్‌లతోపాటు ఈఎస్‌లు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

కార్లు అద్దెకు తీసుకుని..అమ్మేశాడు

నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు

బంజారాహిల్స్,జూన్ 13: కార్లను అద్దెకు తీసుకుని పక్క రాష్ట్రంలో విక్రయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. అత్తాపూర్‌కు చెందిన రషీద్ బంజారాహిల్స్‌లో కార్యాలయం పెట్టి కార్లను లీజుకు ఇస్తుంటాడు. గత ఏడాది నవంబర్‌లో అతని వద్ద బండ్లగూడకు చెందిన మహ్మద్ జాహెద్ అలీ.. డిఫెండర్, ఫోర్డ్ ఎండీవర్ కార్లను అద్దెకు ఇచ్చాడు. నెలనెలా జాహెద్ అద్దె చెల్లిస్తున్నాడు. అయితే ఇటీవల జాహెద్ .. మహారాష్ట్రకు వెళ్లి అద్దెకు తీసుకున్న రెండుకార్లను ఇతరులకు విక్రయించాడు. కాగా.. మహారాష్ట్రలో కార్లు విక్రయిస్తుండగా జాహెద్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో బంజారాహిల్స్ నుంచి రెండుకార్లను తెచ్చి అమ్మేసినట్లు చెప్పాడు. దీంతో వారు రషీద్‌కు సమాచారం ఇచ్చారు. తన నుంచి కార్లు అద్దెకు తీసుకుని విక్రయించిన జాహెద్‌పై కార్ల యజమాని శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఫార్మా ఉద్యోగులకు శిక్షణ

ఖైరతాబాద్, జూన్ 13 : ఫార్మా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆర్ గ్రో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ నఖీ అబ్బాస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను కార్యక్రమ నిర్వాహకులు వనితా కట్టర్, రాఘవ గూడూరు, కల్యాణ చక్రవర్తితో కలిసి ఆవిష్కరించారు. నఖీ అబ్బాస్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో పనిచేసే ప్రొడక్షన్ ఇంజినీర్, క్వాలిటీ ఎస్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్, వేర్హౌజ్, ఈహెచ్ఎస్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు నేటి నుంచి టీహబ్‌లో 21 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కలెక్టర్ గౌతమ్‌కు ఘన వీడ్కోలు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 13: కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి, సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బదిలీ అయిన గౌతమ్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్‌వో హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రాంమోహన్, ఆర్‌డీఓలు వెంకట ఉపేందర్‌రెడ్డి, శ్యామ్ ప్రకాశ్, వివిధ శాఖల అధికారులు గౌతమ్‌కు శాలువాలు కప్పి పూల మొక్కలు అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులను తక్షణమే పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిటీ బ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ల్యాండ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ,